క్లుప్తంగా

తెగుళ్లపై రైతులకు అవగాహన



వృక్షం బొమ్మ ద్వారా అవగాహన కల్పిస్తున్న విద్యార్థినులు

రావికమతం: మత్స్యవానిపాలెంలో రైతులకు వ్యవసాయ పని అవగాహన, అనుభవం అనే అంశంపై అవగాహన కల్పించారు. ఆదివారం ఎచ్చెర్ల కింజరాపు ఎర్రన్నాయుడు వ్యవసాయ కళాశాలకు చెందిన విద్యార్థినులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆకుముడత పురుగు వల్ల కలిగే నష్టాలు, అది వ్యాపించడానికి కారణాలను విద్యార్థినులు చంద్రిక, గౌతమి, మేరి, అపరంజిత, మయూరి, నవ్యశ్రీ వివరించారు.

బాలరాజులబాబుకు ప్రత్యేక పూజలు



బాలరాజులబాబుకు పూజలు చేస్తున్న భక్తులు

రోలుగుంట: అంట్లపాలెం కూడలిలోని బాలరాజులబాబు ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ ద్వితీయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు పాపంటపేట, కె.నాయుడుపాలెం, గుర్రంపేట తదితర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. కమిటీ సభ్యులు గుములూరి బాబూరావు, జి.ఈశ్వరరావు, అడిగర్ల రాజు, రొంగలి అప్పలనాయుడు, వానశెట్టి కృష్ణ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తుల సహకారంతో ఆలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం ఇక్కడ చిడతలు, భజన పోటీలు నిర్వహించారు.

ఏఎంసీ సహాయ కార్యదర్శిగా బంగార్రాజు



బంగార్రాజుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సిబ్బంది

చోడవరం: చోడవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ సహాయ కార్యదర్శిగా బంగార్రాజు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ కార్యదర్శిగా పనిచేసిన కుసుమ విజయబాబు ఉద్యోగోన్నతిపై కొత్తవలస మార్కెట్‌కు వెళ్లారు. ఆయన స్థానంలో అనకాపల్లి మార్కెట్‌లో పనిచేస్తున్న ఎస్. బంగార్రాజును ఉద్యోగోన్నతిపై చోడవరం మార్కెట్ యార్డ్ సహాయ కార్యదర్శిగా నియమిస్తూ మార్కెటింగ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. స్థానిక సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

గొలుగొండ ఎస్ఐగా కృష్ణారావు



గొలుగొండ: స్థానిక పోలీసు స్టేషన్ ఎస్ఐగా బి. కృష్ణారావు ఆదివారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ ఎం. నారాయణరావు ఎస్పీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. కృష్ణారావు ఏపీ ట్రాన్స్‌కో విజిలెన్సు ఎస్ఐగా పనిచేసి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రత్యేక కృషి చేస్తామన్నారు.

8 తులాల బంగారం చోరీ

అనకాపల్లి: గవరపాలెం పార్కు సెంటర్‌లో కర్రి లక్ష్మీనారాయణమ్మ మెడలో 8 తులాల బంగారం తాడు చోరీకి గురైనట్లు పట్టణ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు అందింది. సీఐ జి.శంకరరావు కథనం మేరకు.. ఈ నెల 26న నారాయణమ్మ ఇంటిలో టీవీ పని చేయడం లేదని కేబుల్ ఆపరేటర్ గోవింద్‌కు ఫోన్ చేయగా.. ఆయన రాత్రి 7 గంటలకు వచ్చి కేబుల్ సరిచేసి వెళ్లిపోయాడు. అదే రోజు రాత్రి నారాయణమ్మ కుమార్తె నాగచంద్రిక, అల్లుడు మురళీ.. గౌరీపరమేశ్వరులను దర్శించుకుని ఇంటివచ్చి చూసేసరికి ఆమె నేలపై పడిపోయింది. హుటాహుటిన స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి అక్కడ నుంచి విశాఖ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. కుమారుడు కిషోర్‌కుమార్ ఇంట్లో సీసీ పుటేజీల ఆధారంగా పట్టణ పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు.

శరవేగంగా వంతెన నిర్మాణం

- 16 ఏళ్ల క్రితం చిట్టిగెడ్డపై కుంగిన వంతెన
- రూ.2.40 కోట్లతో పనులు
- మల్లంపాలెం-చౌడువాడ గ్రామాలకు తొలగనున్న కష్టాలు



నీలం తుఫాన్ సమయంలో కుంగిన వంతెన

కె.కోటపాడు: చిట్టిగెడ్డపై వంతెన నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. రూ.2.40 కోట్లతో ఈ పనులు జోరుగా చేస్తున్నారు. 16 ఏళ్ల క్రితం నీలం తుఫాన్ సమయంలో మల్లంపాలెం-చౌడువాడ గ్రామాల మధ్య ఈ వంతెన కుంగింది. అప్పటి నుంచి రెండు గ్రామాల ప్రజలతోపాటు ఈ మార్గంలో రాకపోకలు సాగించే వారు బిక్కుబిక్కుమంటూ ప్రయాణాలను సాగించేవారు. 2014-19లో అప్పటి టీడీపీ హయాంలో ప్రజాప్రతినిధులకు పలుమార్లు గ్రామస్తులు విన్నవించినా ఫలితం లేకపోయింది. దీంతో ఏళ్ల తరబడి ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని భారీ వర్షాల సమయంలో కుంగిన వంతెనపై నుంచి రాకపోకలు సాగించేవారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు స్వయంగా ఇక్కడ వంతెన పరిస్థితిని పరిశీలించారు. ఇక్కడ ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన ఆయన పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే సీఎం స్పందించి రూ.2.40 కోట్లు మంజూరు చేశారు.

జోరుగా పనులు...

గత నెలాఖరులో కురిసిన అకాల వర్షాలకు వంతెన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఆ తర్వాత నీటి ఉధృతి తగ్గడంతో అప్పటి నుంచి పనులు రాత్రింబవళ్లు జోరుగా సాగుతున్నాయి. పూర్తి నాణ్యతా ప్రమాణాలతో 100 ఏళ్లపాటు వంతెన మన్నిక ఉండేలా పనులు చేస్తుండటంతో రెండు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సీఎం జగన్‌కు డిప్యూటీ సీఎం బూడికి కృతజ్ఞతలను చెబుతున్నారు.



చిట్టిగెడ్డపై వంతెన నిర్మాణ పనులు

పట్టించుకోని గత పాలకులు



గత తెలుగుదేశం ప్రభుత్వంలో వంతెన నిర్మించాలని కాళ్లరిగేలా నాయకుల చుట్టూ తిరిగాం. ఒక్క రుపాయి విదిల్చిన పాపాన పోలేదు. మా మల్లంపాలెం గ్రామస్తులు బయట ప్రాంతాలకు వెళ్లాలంటే చిట్టిగెడ్డ వంతెన శరణ్యం. ఈ నేపథ్యంలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాలనలో వంతెన నిర్మించడంతో మా కష్టాలు తీరనున్నాయి.

– బొడ్డు దేముడుబాబు,రైతు, మల్లంపాలెం

ప్రజలకు మంచి చేసిన ప్రభుత్వం



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజల కష్టాలను గుర్తించి వాటికి పరిష్కారం చూపుతోంది. కుంగిన వంతెన పరిస్థితిని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు గుర్తించిన వెంటనే నిర్మాణానికి రూ.2.40 కోట్లు మంజూరు చేయించారు. కలగానే మిగిలిపోయిన వంతెన నిర్మాణం పూర్తి చేస్తున్నందుకు ఆనందంగా ఉంది.

– వి.సూర్యప్రకాశి, గృహిణి, మల్లంపాలెం

మార్చి చివరినాటికి పనులు పూర్తి



చిట్టిగెడ్డపై వంతెన నిర్మాణ పనులు మార్చి చివరి నాటికి పూర్తవనున్నాయి. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్నాం. వంతెన నిర్మాణం పూర్తయితే రెండు గ్రామాల ప్రజలకు రాకపోకల ఇబ్బందులు తీరనున్నాయి.

– పి.రామ్మూర్తి, జేఈ, పంచాయతీరాజ్ ప్రాజెక్ట్స్, కె.కోటపాడు

చదవటం అలవాటు చేసుకోవాలి



విద్యార్థులతో చదివిస్తున్న గ్రంథపాలకురాలు దమయంతి

నర్సీపట్నం: పిల్లలు చదవటం అలవాటు చేసుకోవాలని గ్రంథపాలకురాలు పి.దమయంతి సూచించారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో చిల్డ్రన్ క్లబ్ నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాలకు రావటం వల్ల చదవటం అలవాటు అవుతుందన్నారు. పోటీ ప్రపంచంలో రాణించాలంటే గ్రంథాలయంతోనే సాధ్యమన్నారు. పిల్లలతో కథలు పుస్తకాలు చదివించి వాటిలోని నీతిని బోధించారు. ఆట విడుపుగా కొంత సేపు పిల్లలతో రిక్రియేషన్ గేమ్ ఆడించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు ప్రభాకర్‌రరావు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

కె.కోటపాడు: రాబోయే ఎన్నికల్లో టీడీపీ మాడుగుల నియోజకవర్గ అభ్యర్థి విజయానికి సమష్టిగా కృషి చేయాలని కె.కోటపాడు క్లస్టర్ ఇన్‌చార్జి కన్నూరు సూర్యనారాయణ కోరారు. ఆదివారం కింతాడలో పార్టీ మండలాధ్యక్షుడు రొంగలి మహేష్ ఆధ్వర్యంలో క్లస్టర్ సమావేశాన్ని నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సమన్వయంతో పని చేయాలని సూర్యనారాయణ తెలిపారు. సమావేశంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

15 మందికి వినికిడి యంత్రాల పంపిణీ

గొండుపాలెంలో 255 మందికి వైద్య పరీక్షలు



ఈఎన్‌టీ పరీక్షలు చేస్తున్న డాక్టర్ రామచంద్రరావు

కె.కోటపాడు: గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాల ద్వారా వైద్య సేవలందిస్తున్నట్లు సంఘమిత్ర రూరల్ డెవలప్‌మెంటు సొసైటీ అధ్యక్షుడు, డాక్టర్ బండారు రామచంద్రరావు తెలిపారు. సంఘమిత్ర రూరల్ డెవలప్‌మెంటు సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం గొండుపాలెం హైస్కూల్‌లో వైద్య శిబిరం నిర్వహించారు. 255 మందికి వివిధ వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 159 మందికి ఈఎన్‌టీ పరీక్షలు చేసినట్టు రామచంద్రరావు తెలిపారు. వీటితోపాటు ఓమేగా క్యాన్సర్ ఆస్పత్రి వైద్య సిబ్బంది కేన్సర్ నిర్ధారణ పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇచ్చారు. చెవి సంబంధిత వ్యాధిగ్రస్తులైన 15 మందికి రూ.1.50 లక్షల విలువైన వినికిడి యంత్రాలను ఉచితంగా పంపిణీ చేశారు. ప్రాథమిక దశలోనే వినికిడి సమస్య గుర్తించి వెంటనే మెరుగైన వైద్యం అందిస్తే సమస్య నుంచి బయటపడ వచ్చని ఈఎన్టీ డాక్టరు రామచంద్రరావు అన్నారు. విశాఖ నగరానికి వచ్చే పరిస్థితి లేని వారికి వైద్య శిబిరాల ద్వారా మెరుగైన వైద్యం అందుతుందన్నారు. కార్యక్రమంలో సంఘమిత్ర సొసైటీ ప్రధాన కార్యదర్శి బొంతు మంగపతి, వైద్యులు సుధీర్, కావ్య, శైలజ, సందీప్, రుద్ర, రమేష్, ఆడియాలజిస్ట్ శ్రీకాంత్, సర్పంచ్ బండారు కనక మహాలక్ష్మి, మాజీ సర్పంచ్ వంటాకు శ్రీను, బండారు రామస్వామిపాత్రుడు, సొసైటీ సభ్యులు బండారు మంగపతి, గోవింద, మురళీకృష్ణ, నారాయణరావు, సూర్రెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు కృషి

మాడుగుల రూరల్: కాంగ్రెసు పార్టీ పటిష్టతకు పూర్తిస్థాయిలో కృషి చేస్తామని ఆ పార్టీ మండలాధ్యక్షుడు బాలిబోయిన అప్పారావు పేర్కొన్నారు. ఆదివారం ఆయన ముకుందపురంలో మాట్లాడారు. త్వరలో నిర్వహించే సాధారణ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు. బూత్‌ల వారీగా ఏజెంట్లు నియమించడానికి పార్టీ నాయకులతో కలిసి పనిచేస్తామన్నారు.

ఆశాజనకంగా జనుము పంట



రోలుగుంటలో జనుము పంట

రోలుగుంట: మండల రైతాంగం తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు వచ్చే స్వల్పకాలిక పంటలపై ఆసక్తి చూపుతోంది. దీనిలో భాగంగా జనుము సాగు విస్తారంగా చేపట్టింది. గతేడాది మండలంలో 400 ఎకరాల్లో సాగు చేయగా, ఈ ఏడాది 650 ఎకరాల పైబడి విస్తీర్ణం పెరిగింది. ఏ విధమైన నీటి తడుపు, వర్షాలు అవసరం లేకుండానే మంచు ఆధారంగా పంట చేతికొస్తోంది. ఎకరాకు రెండు బస్తాలు పైబడే దిగుబడులు వస్తాయి. రూ.5 వేలు పైబడి ఆదాయం వస్తుంది. ప్రస్తుతం పూత దశలో ఆశాజనకంగా ఉంది. మరో నెలలో పంట చేతుకొస్తుందని, కూలీలు అవసరం లేకుండా ఇంటిల్లిపాదికి పని సరిపోతుంది. దిగుబడులు, ఆదాయం బాగానే ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

40 ఏళ్ల తర్వాత అపూర్వ కలయిక



తాండవ ప్రాజక్టు వద్ద పూర్వ విద్యార్థులు

నాతవరం: తాండవ రిజర్వాయరుపై పూర్వ విద్యార్థులు సందడి చేశారు. స్థానిక హైస్కూల్‌కు చెందిన 1984-85 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఇక్కడ కలుసుకున్నారు. సుమారు 40 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో వీరి ఆనందానికి అవధులు లేకుండా పోయింది. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఒకరికొకరు ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. మొత్తం 32 మందిలో అయిదుగురు వివిధ కారణాలతో మరణించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఐదు నిమిషాలు మౌనం పాటించారు. ఉద్యోగ, వ్యాపార, వ్యవసాయ రంగాల్లో స్థిరపడ్డ వీరిలో కొంతమంది పిల్లలు వైద్యులు, ఇంజినీర్లుగా ఉన్నత స్థాయిల్లో ఉన్నారని తెలుసుకుని ఆనందించారు. బాల్య స్మృతులను ముచ్చటించుకుని సాయంత్రం వరకు సంతోషంగా గడిపారు. ముందుగా తాండవ ప్రాజెక్టు దిగువన నల్లకొండమ్మ తల్లిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం సంహపంక్తి భోజనాలు చేశారు. బ్యాచ్‌లో ఎవ్వరికి ఎలాంటి కష్టం వచ్చినా ఆదుకోవాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమ నిర్వహణకు చోడవరం హైస్కూల్ ఉపాధ్యాయుడు ఎం. శ్రీనివాసరావు, అన్నవరం దేవస్థానంలో వ్యాపార వేత్త వనుము అప్పలరాజు, బీజేపీ జిల్లా నాయకుడు లక్కోజ్ విక్రమ్, నాతవరం హైస్కూల్ విద్యా కమిటీ మాజీ చైర్మన్ రెడ్డి వరహాలబాబు, నాతవరం సిద్ధి వినాయక ఆలయ నిర్మాణదాత యర్రా కాశీవిశ్వేశ్వరరావు, వ్యాపార వేత్త యర్రా ప్రకాశ్ కృషి చేశారు.

30న జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పోటీలు

మాడుగుల రూరల్: మండలంలో సాగరం పంచాయతీ శివారు వాడపాడులో ఈ నెల 30న సీతారాముల తీర్థం ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఎడ్ల బళ్ల పరుగు, ముగ్గుల పోటీలు నిర్వహిస్తామన్నారు. ఎడ్ల బళ్ల పోటీల్లో మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన వాటికి రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.2 వేల చొప్పున బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

జాలంపల్లిలో ఘనంగా రాములోరి తీర్థం

మాడుగుల: జాలంపల్లిలో రాములోరి తీర్థం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తీర్థంలో పంచదార చిలుకలు, నెయ్యిచెక్కీలు హాట్‌కేక్‌లా అమ్మకాలు సాగాయి. సాయంత్రం ప్రదర్శించిన నేల వేషాలు, తోడపెద్దు ఉత్సవాలు, రంగులరాటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

విస్తారంగా కూరగాయల సాగు

మెట్ట ప్రాంతాల్లో పండిస్తున్న రైతులు



కె.కె.అగ్రహారంలో టమాటా పంట



బొట్టవానిపాలెంలో ఖాళీఫ్లవర్ సాగు

కె.కోటపాడు: మండలంలో మెట్ట ప్రాంత గ్రామాల్లో విస్తారంగా కూరగాయల సాగవుతోంది. ఏటా వేసవిలో కూరగాయల ఉత్పత్తి తగ్గుతోంది. ఆ సమయంలో అందుబాటులో ఉన్న పంటకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటోంది. ఈ నేపథ్యంలో మంచి మద్దతు ధర లభించనున్న దృష్ట్యా రైతులు ఇప్పటి నుంచే నీటి లభ్యత కలిగిన పొలాల్లో కూరగాయలు పండిస్తున్నారు. సూదివలస, కింతాడ, ఆర్లి, బొట్టవానిపాలెం, చంద్రయ్యపేట, కె.కె.అగ్రహారం, కె.సంతపాలెం, గవరపాలెం, పిండ్రంగి గ్రామాల్లో టమాటా 200 ఎకరాలలోను, క్యాబేజీ, ఖాళీఫ్లవర్ 60 ఎకరాలలోను, మిరప 40 ఎకరాలలోను, చిక్కుడు 30ఎకరాలలోను, వంగ 60 ఎకరాలలోను సాగుచేస్తున్నారు. ప్రస్తుతం ఈ పంటలకు శీతాకాల పరిస్థితులు అనుకూలించడంతో మరో నెల రోజుల్లో పంట ఉత్పత్తి ప్రారంభం కానుందని రైతులు చెబుతున్నారు.

రక్తదాన శిబిరం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

దేవరాపల్లి: అమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మార్చి 3న ఎ. కోడూరు హైస్కూలులో నిర్వహించనున్న రక్తదాన శిబిరం పోస్టర్‌ను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆదివారం తారువ క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. అమ్మ చారిటబుల్ ట్రస్టు సేవలను ఈ సందర్భంగా ఆయన ప్రశంసించారు. అత్యవసర సమయంలో ప్రాణాలు కాపాడటం కోసం ప్రత్యేక శిబిరాల ద్వారా సేకరించిన రక్తం చాలా ఉపయోగపడుతుందని ట్రస్టు చైర్మన్ గొంప వెంకటరావు తెలిపారు. వైఎస్సార్ టీచరు ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు చిరికి శ్రీనివాస్, సూర్రెడ్డి బాబూరావు, ట్రస్టు వైస్ చైర్మన్ సింగంపల్లి అర్జున్, సభ్యులు సూర్రెడ్డి శ్రీను పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పోటీ పరీక్షల పుస్తకాలు



పుస్తకాలు చదువుతున్న పాఠకులు

దేవరాపల్లి: స్థానిక గ్రంథాలయానికి జిల్లా గ్రంథాలయ సంస్థ నుంచి పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు వచ్చాయని గ్రంథపాలకుడు ఓ. శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. గ్రంథాలయ పాఠకుల డిమాండ్ మేరకు జియోగ్రఫీ, మెంటల్ ఎబిలిటీ, భారతీయ సమాజం, సైన్సు అండ్ టెక్నాలజీ, ఆధునిక ఆంధ్రప్రదేశ్ చరిత్ర, ఇంగ్లిషు మీడియానికి సంబంధించి ఇండియన్ పాలిటీ, తదితర పుస్తకాలు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొండా రాజీవ్‌గాంధీ, కార్యదర్శి వెంకట్రావు అందజేశారన్నారు.

ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌కు పురస్కారం



కలెక్టర్ నుంచి పురస్కారం అందుకుంటున్న సూపర్‌వైజర్ చిన్నమ్మలు

మాడుగుల: విధి నిర్వహణలో ఉత్తమ సేవలందిస్తున్న మాడుగుల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పోతల చిన్నమ్మలుకు విశిష్ట గుర్తింపు లభించింది. గణతంత్ర దినోత్సవ సందర్భంగా అనకాపల్లిలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి నుంచి ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈ మేరకు సీడీపీవో శ్రీదేవితోపాటు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఆమెకు ఆదివారం అభినందనలు తెలిపారు.

వైఎస్సార్ పశు బీమాతో ఎంతో మేలు



ఏడీ చిట్టినాయుడు

మాడుగుల/ రూరల్: వివిధ రకాల వ్యాధులు లేదా ప్రమాదవశాత్తు పశువులు మరణిస్తే, పాడి రైతులకు ఆర్థిక ప్రయోజనం చేకూరేలా రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ పశు బీమా పథకం రూపొందించింది. ఈ పథకంలో చేరాలంటే లబ్ధిదారు వాటా కింద 20 శాతం ప్రీమియం చెల్లించాలి. తెల్ల రేషన్‌కార్డు లేని రైతులు 50 శాతం చెల్లించాలి. పశువులకు మూడేళ్లపాటు, పందులకు ఒకట్రెండు లేదా మూడేళ్లపాటు బీమా పథకం వర్తిస్తుంది. నెలలు, సంవత్సరాలు కాలయాపన లేకుండా పశువు మరణించిన 21 రోజుల లోపు లబ్ధిదారు బ్యాంకు ఖాతాకు పరిహారం జమయ్యేలా నిబంధనలు పెట్టారు. ఏదైనా సాంకేతిక కారణాలు వల్ల పరిహారం జమకాకపోతే ఆ విషయాన్ని ఆన్‌లైన్ పోర్టల్‌లో ఉంచుతారు. దేశవాళీ, సంకర జాతి, ఆడ, మగ పశువులకు రూ 30 వేల వరకు, నాటు జాతికి చెందిన ఆడ, మగ పశువులకు రూ.15 వేల వరకు, గొర్రెలు, మేకలు, పందులకు రూ.6 వేల వరకు ప్రభుత్వ సబ్సిడీతోపాటు బీమా సౌకర్యం కల్పిస్తున్నారు. లబ్ధిదారు ప్రభుత్వ నిర్ధారించిన బీమా మొత్తం కన్నా ఎక్కువ చేయించుకుంటే, ఆపై మొత్తానికి పూర్తి ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. ఆవులు, గేదెలు గరిష్ఠంగా రూ.1.20 లక్షల వరకు, గొర్రెలు, మేకలు, పందులకు గరిష్ఠంగా రూ.15 వేల వరకు బీమా చేయించుకునే సదుపాయం ఉంది. లబ్ధిదారు పశువును వేరొక రైతుకు విక్రయించినా ఆ వివరాలు ఏడు రోజులులోగా తెలియజేస్తే పాలసీని కొనుగోలు చేసిన రైతుకు వర్తించేటట్లు కార్యాచరణ చేస్తామని మాడుగుల ఏరియా పశువైద్యశాల సహాయ సంచాలకుడు వి. చిట్టినాయుడు తెలిపారు. బీమా పరిహారానికి ట్యాగు తప్పనిసరి అన్నారు. పూర్తి వివరాలకు రైతు భరోసా కేంద్రంలో సంప్రదించాలని సూచించారు.

ముగిసిన గౌరీ పరమేశ్వరుల మహోత్సవం



మహోత్సవంలో బాణసంచా మెరుపులు



ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

అనకాపల్లి : స్థానిక గవరపాలెం గౌరీపరమేశ్వరుల మహోత్సవం అంగరంగ వైభవంగా ఆదివారం తెల్లవారు జామున ముగిసింది. ఉత్తరాంధ్ర జిల్లాలో అత్యంత వైభవంగా కనీవిని ఎరుగని రీతిలో ఈ ఏడాది మహోత్సవానికి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు కుటుంబ సమేతంగా వేడుకలు తిలకించారు. నేలవేషాలు, స్టేజ్ ప్రోగ్రాంలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. పలు స్వచ్ఛంద సంస్థలు అమ్మవారి ప్రసాద వితరణ, మజ్జిగ, తాగునీటి సౌకర్యం కల్పించాయి. మందు గుండు సీతారామయ్య కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ బాణసంచాను ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కొణతాల సంతోష్ అప్పారావునాయుడు ప్రారంభించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘనలు జరగకుండా డీఎస్పీ వి.సుబ్బరాజు, పట్టణ సీఐ జి.శంకరావు భారీ బందోస్తు నిర్వహించారు. కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, కోశాధికారి కొణతాల మహాలక్ష్మీనాయుడు, నూకాంబిక అమ్మవారి దేవస్థానం చైర్మన్ కొణతాల మురళీకృష్ణ పాల్గొన్నారు.

రైలు ఢీకొని యువకుడి మృతి



గురుమూర్తి మృతదేహం

అనకాపల్లి: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో రైలు పట్టాలు దాటుతున్న లక్ష్మీదేవిపేటకు చెందిన గురుమూర్తి (27) రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. దువ్వాడ జీఆర్పీ హెచ్‌సీ ఎస్.రమేష్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శనివారం పట్టణంలో గౌరపరమేశ్వరుల అమ్మవారి ఉత్సవాన్ని తిలకించి లక్ష్మీ దేవిపేట పంట పొలాలు బ్రిడ్జి వద్ద పట్టాలు దాటుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. గురుమూర్తి నాలుగు నెలలుగా లక్ష్మీదేవిపేట పొలాల వద్ద పాకలో నివసిస్తున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టర్ నిమిత్తం స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

16న రథసప్తమి వేడుకలు

అనకాపల్లి: రాజుపాలెంలో సూర్యనారాయణమూర్తి రథసప్తమి వేడుకలు ఫిబ్రవరి 16న నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకుడు కొణతాల బాబూరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 14న ఉదయం 7 గంటలకు సూర్యనారాయణమూర్తి కల్యాణం, మధ్యాహ్నం 3 గంటలకు సారె ఊరేగింపు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంత్రి అమర్‌నాథ్ సహకారంతో హైవే నుంచి దేవస్థానం వరకూ రూ.1.50 కోట్లతో కొత్త రోడ్డు వేసినట్లు తెలిపారు.